అత్తవారింటికి వెళ్ళి మూడు రోజులూ ఉండి వచ్చింది. చెల్లెలి ఇంటిని చూసి ఎంతో ముచ్చట పడింది.

రవి రాలేదన్న బాధ మాత్రం ఆ ఇంట అందరికీ ఉంది. అందరికీ సర్ది చెప్పలేక సింధూరి సతమతమైంది. ఇక అంతా ఐంది కనుక, మరునటి రోజు లేడీ డాక్టరుకు సింధూరిని చూపించి, తరువాత కూతురి వెంట వరంగల్ వెళ్ళి అలాగే అల్లుడిని పలకరించి రావాలని నిర్ణయించుకున్నాడు విశ్వనాథం.

*** *** ***

పొద్దెక్కినా సింధూరి లేవలేదేమిటా - అని గదిలోకి వెళ్ళింది వరలక్ష్మమ్మ. సింధూరి చేయందుకుని కెవ్వుమని అరిచిందామె. ఆ అరుపుకు అందరూ పరుగెత్తుకు వచ్చారు. అప్పటికే సింధూరి ఈ లోకాన్నుంచి సెలవు తీసుకుంది.

దిండు కింద రెపరెపలాడే ఉత్తరాన్ని తీసి చదివి అక్క మీద వాలిపోయింది జాహ్నవి.

"నా ప్రియమైన జాహ్నవీ!

మీ అందరి గుండెల్లో విరిసిన ఆనందపు మల్లెల్ని ఒక్కసారే....ఒక్కదాన్నే తెంచుకుని పోతున్నానే. ఎంత స్వార్థమో కదూ? నన్ను క్షమించు. నీ పెళ్ళి నిండుగా జరగాలని, ఏ ఆటంకమూ రాగూడదని ప్రతి నిమిషం నాలో నేనే రగిలి...రగిలి, కుమిలి...కుమిలి...వద్దు తల్లీ, ఆ నరకం! ఎప్పుడూ అబద్ధం చెప్పని నేను కాలకూట విషంలాంటి ఈ నిజాన్ని దాచాలని అడుగడుగునా అబద్ధాలు చెబుతూ మిమ్మల్ని నమ్మించాను. మీ అందరి ఆప్యాయతలో తేలిపోతూ ఇంకా...ఇంకా ఉండాలన్న ఆశ చావక జీవితాన్ని ఎక్స్‌టెండ్ చేసుకుపోతున్నా కానీ...ఇక నా చేతకాదే! అబద్ధాలు చెప్పి చెప్పి అలసిపోయాను. అందుకే సెలవు తీసుకుంటున్నాను.

మీరంతా ఎంతో ఉన్నతుడిగా ఊహించే మీ బావ ఓ అల్పుడని చాల ఆలస్యంగా తెలుసుకున్నా. అతని హృదయం పాషాణమని మొదటిసారే కనుగొన్నాను. నాకు పిల్లలు పుట్టలేదన్న ఓ చిన్న సాకుతో నిన్నే కావాలంటే...నేనేం చెప్ప గలను? హాస్యమని పరిహసించ బోయాను. నిజమని తెలిసి నివ్వెరబోయాను. పన్నీరు తప్ప కన్నీ రెరుగని మీ గుండెలను నా సమస్యాక జడివానై కుదిపేస్తుందని పెదవి విప్పి చెప్పలేక పోయాను.

పిల్లల కోసమే ఐతే వే రెవరినైనా చేసుకోమని అర్థించాను. కాళ్ళు పట్టుకొని వేడుకున్నా ఫలితం లేదు సరికదా నరకం అంటే ఎలా ఉంటుందో చూపించారు. ఏ రాక్షస క్షణాన ఆ ఊహ అతనిలో చోటు చేసుకుందో తెలియదు కానీ, నీ పెళ్ళి గురించిన ఉత్తరం రావడంతో అతని నీచత్వం బయట పడింది. అతను కోరేది నీ అందాన్నని మొదటిసారిగా తెలుసుకున్నాను. నీ అంగీకారంతోనే రావాలి తప్ప, నీవు లేని ఆ ఇంట్లో నాకు స్థానం దొరకదని కచ్చితంగా చెప్పారే!

ఈ సంగతి ముందే నాన్నకు తెలిస్తే, 'తన బంగారు తల్లి జీవితం ఇలా బూడిదపాలైం'దని తట్టుకోలేరనీ, తన రెండు కళ్ళలో అమృతం దాగుందని మురిసే అమ్మ ఓ కంట్లో విషం నిండుకుందని తెలిసి ఉండలేదని, అందరికంటే ముందే, మీ అందరి ఒడిలోనే సెలవు తీసుకోవాలని చెప్పలేదే! ఇక నుంచి నువ్వూ, నేనూ అన్నీ నీవై అమ్మా, నాన్నా బామ్మలను మరిపించాలి. సరేనా?

మీ అందరికీ అనుమానం రాకుండా నా కొచ్చే ఉత్తరాల్ని నేనే రాసుకునే దాన్ని. పెళ్ళి హడావిడిలో మీరు గమనించ లేదు. కాని నే నెంత అదృష్టవంతురాల్నో తెలుసా? నా ఈ చిన్న జీవితంలో మీ అందరి సమక్షంలో ఈ నెలరోజుల్లో ఓ యుగానికి సరిపడా అనురాగాన్నీ ఆప్యాయతనూ, ఆత్మీయతనూ పొందాను. ఇంకేం కావాలి? మళ్ళీ ఎం తా శో చూశావా? తిరిగి నీ కడుపునే పుట్టాలని ఉందే. బామ్మా! నీ ఛాన్సు నేను కొట్టేస్తున్నా కోప్పడొద్దు. ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా ఇలా మరో క్షణ మాలోచిస్తే మీ అందరి ప్రేమే చాలన్న తలపు నాలో నిండి ఉండిపోత నేమో! అందుకే వెళ్ళి పోతున్నా.

ప్రేమతో
మీ
సింధూ."

## మినీకథ

## గురుభక్తి

### వనుము సోమశేఖరరావు

అన్ని ఉన్నత పాఠశాలల్లా అదీ ఓ ఉన్నత పాఠశాలే. అంటే అక్కడ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతి పరిమిత సంఖ్యలో బల్లలు, కుర్చీలు మిగిలిన పాఠశాలల్లో వలె అక్కడా ఉన్నాయి.

ప్రధానోపాధ్యాయుల వారివి ఉన్నత ఆశయాలు. సమయసమ్ఫూర్తిచక్కటి మూర్తిమత్వము, బోధనా శక్తి, ఆత్మ బలం, నచ్చీలము మున్నగునవన్నీ ఆయన సొంతం.

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు నిజాయతీపరులు, బోధనలో చాకచక్యం గలవారు, విద్యార్థులందరినీ ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలన్న తాపత్రయం గల ఉపాధ్యాయులు మాత్రమే ఆ పాఠశాలలో ఉండటమనేది నిజంగా ఆ విద్యార్థుల అదృష్టమే మరి.

విద్యార్థులు - బుద్ధి మంతులు, అల్లరి గాళ్ళు, చదివే వాళ్ళు, చదవని వాళ్ళు, యవ్వనం వేడికి తాళలేక దొంగపేర్లతో ప్రేమలేఖలు రాసేవాళ్ళు..అంగట్లో అన్ని రకాల సరుకు ఉన్నట్లే పాఠశాల ముంగిట్లో ఉండటం సహజమే మరి! వినయ విధేయతలు గల విద్యార్థినీ విద్యార్థుల మాట సరేసరి - వెయ్యి దీపాలు పెట్టి వెతికినా వినయం కనిపించని వాళ్ళూ ఉన్నారక్కడ. ఉపాధ్యాయు లెందుకులే చదువుకోవటానికి గైడ్లు ఉన్నాయి కదా, అటెండన్స్ ఉంటే చాలు అనే అభిప్రాయమేమో మరి వాళ్ళది.

మాష్టారు దార్లో కనిపిస్తే నమస్కారం పెట్టడం గాని, సైకిలు మీదనుంచి దిగి నడిచివెళ్ళడం గాని సాధారణంగా అటువంటి వాళ్ళకు అలవాటు లేదనే చెప్పాలి.

ఆ రోజు మంగళవారం. పాఠశాలకు ఇన్‌స్పెక్టర్‌గా రొచ్చారు. ప్రధానోపాధ్యాయుల వారింట్లో ఆయనకు భోజనం ఏర్పాట్లు జరిగాయి. మధ్యాహ్నం వారిద్దరూ ఇంటికి బయలుదేరారు భోజనానికి. స్కూలు గేటు దాటి బయటకు రాగానే కొంచెం దూరంలో ఒక విద్యార్థి సైకిలు దొర్లించుకుంటూస్కూలువైపు రావటం వారిద్దరూ గమనించారు. ఎప్పుడూ తనని చూసి సైకిలు దిగని ఆ విద్యార్థికి ఆ వినయం ఎక్కడ నుంచి వచ్చిపడిందో అర్థం కాని ప్రధానోపాధ్యాయుల వారి బుర్ర గిర్రున తిరిగింది.

"హెడ్మాస్టర్‌గారూ! చాలా స్కూళ్ళలో క్రమశిక్షణ, విద్య కనుమరుగయి పోతున్నాయండీ. మీ స్కూల్లో మాత్రం పిల్లల క్రమ శిక్షణ, విద్య పట్ల శ్రద్ధా భక్తులు చాలా బాగున్నాయి. గురుభక్తి చూడండి - ఆ కుర్రా డెలా మీ ఎదుట సైకిలు ఎక్కకుండా నడిపించుకొస్తున్నాడో" అన్నారు ఇనస్పెక్టర్‌గారు ప్రధానోపాధ్యాయుల వారిని చంపేస్తూ.

ముందు పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లు తడబడ్డ హెడ్మాస్టరు - "ఆ..ఆ.. అవునండీ.నేనెప్పుడూ పిల్లల్ని క్రమ శిక్షణలోనే ఉంచుతాను. మా ఉపాధ్యాయులు ముందు క్రమశిక్షణకే విలువిచ్చి తర్వాత చదువువిషయం చూస్తారండీ. ఛా ఛా ఛా" అంటూనవ్వారు ముఖంలో లేని కళను తెచ్చిపెట్టుకుని.

ఆ కుర్రాడు సైకి లెందుకు దిగివస్తున్నాడో ఇంకా అర్థం కాని ప్రధానోపాధ్యాయుడు అతన్ని పరిశీలనగా పైనించి కిందికి చూశారు. ఆశ్చర్యం సైకిలు వెనుక చక్రంలో గాలి లేదు. నా నాన్నా - అందుచేత నడిచి వస్తున్నావా ఈ రోజు అనుకుంటూ - ఇనస్పెక్టర్ గారు కొంప తీసి అసలు విషయం కాస్తా గమనించారంటే గుట్టు రట్టవుతుందనే భయంతో ఆయన దృష్టిని మరల్చటానికి లోన కంగారుపడుతూ అన్నారు ప్రధానోపాధ్యాయులు "వన మహోత్సవం సందర్భంగా మొన్న కుర్రాళ్ళ చేత ఆ మొక్కలన్నీ పాతించామండీ, ప్రకృతి లక్ష్మి పచ్చటి చీర కట్టుకున్నట్లు ఎంత అందంగా ఉందో చూడండి అదంతా."

